



టీడీపీ కూటమి అభ్యర్థులుగా బాపట్ల లోక్‌సభ స్థానానికి తెన్నేటి కృష్ణప్రసాద్, అసెంబ్లీ స్థానానికి వేగేశన నరేంద్రవర్మ తరపున ఆయన సతీమణి హరికుమారి శుక్రవారం మొదటిసెట్ నామినేషన్లను దాఖలు చేశారు. అంతకముందు వీరు పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. - బాపట్ల



బీమాయ!



కేంద్రం ఇచ్చే 50 శాతం వాటా ఇప్పుడు లేనప్పటికీ దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్తి ఖర్చు రాష్ట్రమే భరిస్తూ ఉచిత బీమా అమలు చేస్తోంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయి నిస్సహాయ స్థితిలోని నిరుపేద కుటుంబాలకు ఆలంబనగా జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ వైఎస్సార్ బీమా..! - ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్సార్ బీమాపై చెప్పిన మాటలు... కానీ ఆచరణ అందుకు పూర్తి విరుద్ధం గా వుంది. ప్రీమియం చెల్లించని కారణంగా అనేక మంది కార్మికులు ఈ పథకానికి దూరమ య్యారు. కరోనా బారినపడి చనిపోయిన వందలాది కుటుంబాలకు ఈ పథకం వర్తించ లేదు. అందుకు కారణం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి బీమా పథకానికి ప్రీమియం చెల్లించకపోవడమే!

- తండ్రి పేరు పెట్టి చంద్రన్న బీమాకు కొర్రీలు
- పూర్తిగా నీరుగారిన కార్మిక సంక్షేమ పథకం
- 5 లక్షల నుంచి 2 లక్షలకు పడిపోయిన లబ్ధిదారులు
- ఐదేళ్లుగా పెండింగులో క్లెయిమ్‌లు 11 కోట్ల బకాయిలు
- మహిళలకు పూర్తిగా మొండిచేయి చూపిన ప్రభుత్వం



గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన అతిపెద్ద కార్మిక సంక్షేమ పథకం చంద్రన్న బీమా! ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరు కార్చేసింది. ఈ పథకానికి తన తండ్రి పేరు పెట్టుకున్న ముఖ్యమంత్రి ఆ పేరుకు నష్టం వాటిల్లుతుందన్న జంకు కూడా లేకుండా కార్మికులను వంచించారు. పథకంలో ఎక్కడికక్కడ కొర్రీలు పెట్టి పథకాన్ని పూర్తిగా నీరుగార్చేశారు. చంద్రబాబు హయాంలో బీమాపై ధీమాతో వున్న కార్మికులు ఇప్పుడు ధీమా కరువై ఆందోళన చెందుతున్నారు.

నయవంచన..


టీడీపీ హయాంలో చంద్రన్న బీమా పథకం కింద సాధారణ మరణం అయితే యాభై ఏళ్ల వయస్సు ఉన్నవారికి రూ.2 లక్షలు, 50 ఏళ్లకు పైబడి 59 ఏళ్ల వయస్సు వారికి రూ.30 వేల బీమా పరిహారం అందించారు. కుటుంబంలో ఎవరు చనిపోయినా పరిహారం ఇచ్చేవారు. ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్సుతో సంబంధం లేకుండా వర్తింపజేశారు. రెండు నెలల్లోపే పరిహారం పంపిణీ చేశారు. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక పథకం కుచించుకుపోయింది. 2021 వరకూ పథకం ఊసే ఎత్తకపోవ డంతో అప్పటి వరకూ పథకం అమలులో లేకుండా పోయింది. ఫలితంగా 2019- 21 మధ్య కాలంలో చనిపోయిన, అందునా కరోనా కాలంలో చనిపోయి సర్వస్వం కోల్పోయిన కష్టజీవులకు ఈ పథకం వర్తించలేదు. దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాగా 2021-22లో వైఎస్సార్ బీమా కింద పథకాన్ని అమలు చేసినా అది ఏమాత్రం ఉపయోగం లేనిదిగా మారిపోయింది. 18- 50 ఏళ్ల ఉండి సంపాదించే వ్యక్తి సహజ మరణం చెందితే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించారు. 18- 70 ఏళ్ల మధ్య ఉండి సంపాదించే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలి.

మట్టి ఖర్చులూ ఇవ్వడం లేదు

బాధితులు మృతి చెందిన రోజునే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు చెల్లించాల్సి ఉంది. నెలలు గడిచినా ఇవ్వడం లేదు. ప్రమాద మరణాలకు సంబంధించి ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికేట్, పోస్టుమార్టం నివేదిక ఉంటేనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాల్లో చనిపోతే డ్రైవింగ్ లైసెన్స్ నిబంధన కచ్చితం చేశారు. ఈ కారణంతో ఏటా వేలాది మందికి బీమా అందడం లేదు. కాగా కుటుంబ పెద్దలకు మాత్రమే పథకం వర్తిస్తుందన్న నిబంధన కారణంగా ఒకే కుటుంబంలో పనిచేసే ఇతర కార్మికులకు ఈ పథకం వర్తించడం లేదు. ఒకే ఇంట్లో భార్యాభర్తలుంటే పథకం భర్తకు మాత్రమే వర్తిసుండగా మిగిలిన కుటుంబ సభ్యులకు వృథా అవుతుంది.

వేలాది క్లెయిమ్‌లు పెండింగ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 14లక్షల 91వేల 412 మంది వైఎస్సార్ బీమా కింద నమోదై వున్నారు. వారిలో 10లక్షల 21వేల 371 మంది మాత్రమే అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. మిగిలిన 3 లక్షల 96వేల మందిని ప్రభుత్వం అనర్హులుగా చేసింది. కాగా 2019 నుంచి ఇప్పటి వరకూ 18,032 క్లెయిములు నమోదవగా, వాటికి సంబంధించి ఇప్పటి వరకూ 8,313 క్లెయిములకు



మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించింది. మిగిలిన క్లెయిములు ఇప్పటికీ పెండిం గులోనే వున్నట్లుగా తెలుస్తోంది. కాగా బీమా క్లెయి ముల విషయంలో ప్రభుత్వం, అధికారులు గోప్యతను ప్రదర్శిస్తున్నారు. క్లెయిముల వివరాలు డాష్‌బోర్డులో పెట్టకుండా జాగ్రత్త పడుతున్నారు. 2020- 24 మధ్య కాలానికి సంబంధించిన క్లెయిముల వివరాలు బయట కు రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. కాగా జిల్లాలో 6,878 క్లెయిములు పెండింగులో వున్నాయని, వాటి తాలూకు కార్మికులకు రూ.11 కోట్ల వరకు పరిహారం అందాల్సి వుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

గుంటూరు ఛానల్‌కు.. గ్రహణం



పర్చూరుకు పొగిడించాల్సిన గుంటూరు ఛానల్

రివర్స్ టెండర్‌తో ముంచారు..

ప్రజలకు తాగునీటితో పాటు, సాగు నీటిని అందించేందుకు దోహద పడే గుంటూరు ఛానల్ పొడిగింపునకు వైసీపీ రివర్స్ టెండర్ పేరుతో నిలుపుదల చేసింది. రీ సర్వే పేరుతో కాలయాపన చేయడం వల్లే సాగు, తాగునీటి కోసం ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తుంది. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే రైతులతోపాటు, గ్రామస్తులకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేది.

- కాకాని వీరయ్య, పర్చూరు రైతు

- ఛానల్ పొడిగింపుపై నెరవేరని జగన్ హామీ
- రివర్స్ టెండర్.. ఐదేళ్లుగా సర్వేల పేరుతో సరి
- సాగు, తాగునీటి అవస్థల్లో పర్చూరువాసులు

పర్చూరు, ఏప్రిల్ 19: గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో, ముఖ్యమంత్రి అయిన తర్వాత వైసీపీ అధినేత జగన్ గుంటూరు ఛానల్ అభివృద్ధి, పొడిగింపుపై ఎన్నో హామీలు ఇచ్చారు. దీంతో గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న రైతులు తమ కల నెరవేరిందని ఆశించారు. అయితే ముఖ్యమంత్రి జగన్ రివర్స్ టెండరింగ్ విధానాలు వారి ఆశలను వమ్ము చేసింది. జగన్ ప్రభుత్వ రివర్స్ టెండర్ నిర్ణయంతో గుంటూరు ఛానల్‌కు గ్రహణం పట్టింది. ఐదేళ్లుగా సర్వేలతో అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ పర్చూరు, కాకుమాను, పెదనందిపాడు సభల్లో గుంటూరు ఛానల్‌ను పొడిగిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత 2022 జనవరి 1న ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ సభలో మరోమారి వాగ్దానం చేశారు. జగన్ తన పదవీ కాలంలో 99 శాతం హామీలను అమలు చేశామని ప్రచారం చేస్తున్నారు. అయితే గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో మడమ తిప్పారని, దీనినిబట్టి మిగతా హామీలు ఎక్కడ నెరవేర్చారో అర్థమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. వైసీపీ హయాంలో గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొగింపు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాల ప్రజలకు తాగునీటితోపాటు సాగు నీరు అందే అవకాశం ఉన్నా పాలకులకు పట్టడం లేదు. రైతు సంఘం పోరాటాలతో గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేలా ప్రభుత్వం నిధులను కూడా కేటాయించింది. తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఛానల్ పొడిగింపు అదిగోఇదిగో అంటూ కాలయాపన చేసింది. వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసినా నేటికీ ఛానల్ పొడిగింపునకు నోచుకోలేదు. కేవలం సర్వేల పేరుతో సరిపెట్టిందని రైతులు, రైతు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏటేటా తాగు, సాగు నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం తాగునీటి కోసం సాగర్ నీటిని విడుదల చేసిన పర్చూరు ఆయకట్టు చివర ఉండడంతో చెరువులకు నీరు సక్రమంగా చేరుతున్న దాఖలాలు లేవు. దీంతో తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఆరు తడులు అందక మిర్చి, వైట్ బర్లీ పొగాకు పంటలను వేల ఎకరాల్లో సాగు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలను కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా వేలకు వేలు చెల్లించి మరీ నీరు అందించారు. దీంతో సాగు కోసం అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. అదే గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొగిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని ప్రజలు అంటున్నారు.



ఛానల్ పొడిగింపు కోసం డాక్టర్ రాజ మోహన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రైతుల నిరాహార దీక్ష (ఫైల్ ఫోటో)

దగా మామ!

- తలనూనె, సబ్బులకు డబ్బులు ఇవ్వలేదు..
- వసతి గృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మోటిక్ ఛార్జీలు
- నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు
- ఈ లోగా పిల్లలకు డబ్బు చెల్లించేనా ?



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. గిరిజన, బీసీ, ఎస్సీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండేది అధికంగా పేద పిల్లలు. తాము పడుతున్న కష్టం తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో కిలో మీటర్ల మేర దూరంతో ఉన్న వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు, ఇతరత్రా చేతి ఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇస్తుందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిన దుస్థితి. నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈ లోగానైనా పిల్లల డబ్బు చెల్లింస్తారో లేదో?

వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలను జమచేయాలి. జూన్ నెలలో వసతి గృహాలు ప్రారంభమైతే రెండు నెలలకు సదరు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిది నెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది వారి తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు నెలలు తరబడి కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆశ్ర యిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల బాలికలకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదు. 2019 వరకు కాస్మోటిక్ కిట్‌లను బాలికలకు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపి వేయడం గమనార్హం.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

అద్దంకి పసుపు మయం

- ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి నామినేషన్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



శ్రేణులతో నడిచివస్తున్న రవికుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా ఆయన నామినేషన్లను సమర్పించారు. పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి ర్యాలీ ఆర్వో కార్యాలయం వరకు సాగింది. దీంతో పట్టణం మొత్తం పసుపుమయంగా మారింది. ఎండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి శ్రేణులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువత తరలివచ్చింది. గొట్టిపాటి ర్యాలీతో పట్టణం జనసంద్రంగా మారింది. వారి నినాదాలతో దద్దరిల్లింది. తొలుత ఆయన కుటుంబసభ్యులతో కలిసి చిలకలూరిపేటలోని శివాలయం, యద్దనపూడి వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం శింగరకొండలోని లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, వేయి స్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవానీ సెంటర్ నుంచి ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ మీదగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు గొట్టిపాటి పాదయాత్ర చేశారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్వో టీవీ సునీల్‌కు గొట్టిపాటి రవికుమార్, సతీమణి ఝాన్సీ, న్యాయవాదులు నాదెండ్ల దశరథరామయ్య, గొట్టిపాటి శ్రీనివాసరావులతో కలిసి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ర్యాలీలో గొట్టిపాటి తనయులు హర్షవర్ధన్, మహేష్ బాబు, సోదరుడి కుమారుడు కమల్‌కిశోర్(బాబీ) పాల్గొన్నారు.



ఆర్వోకు నామినేషన్‌ను అందజేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్



శింగరకొండ ఆలయంలో పూజలు చేస్తున్న గొట్టిపాటి రవికుమార్ దంపతులు

కూటమి గెలిస్తేనే రైతులకు మేలు

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు
- ఒక్క ఛాన్స్‌తో అందరినీ ముంచేశాడు
- మరోసారివస్తే ఇంకేం మిగలదు : కన్నా లక్ష్మీనారాయణ




నకరికల్లు మండలం కంకలగుంట గ్రామంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

నకరికల్లు, ఏప్రిల్ 19: ప్రతి ఏడాది సాగర్ జలాలు విడుదల కాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గోదావరి, పెన్నా నదుల అనుసంధానం ద్వారా ఏటా సాగర్ జలాలు అందుబాటులోకి రావటంతో పల్నాడుజిల్లా పాడిపంటలతో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. కుంకలగుంటకు రూ.40 లక్షలు జలజీవన్‌మిషన్ నిధులు విడుదలైనా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నా ఈ ప్రభుత్వం పని చేయించుకోలేక పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి రావటంతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని, 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బీసీలకు బీసీకార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వటంతోపాటు బీసీ రక్షణచట్టం అమల్లోకి తెస్తామన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ప్రత్యేకంగా ఎస్సీలకే కేటాయిస్తామన్నారు. టీడీపీ కష్టకాలంలో అండగా ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కోరుకొని మరీ నేను పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట నుంచి పోటీ చేస్తున్నట్లు, విజ్ఞులైన పల్నాడు ప్రజలు తనను, ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే దోపిడీ, విధ్వంసం, అరాచకాలకు అడ్రస్‌గా మార్చారన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, డీసీల్, పెట్రోల్ ధరలనుపెంచి నిత్యవసర సరుకుల ధరలనూ పెంచారన్నారు. రాజధాని అభివృద్ధి, పోలవరం పూర్తి చేయటం, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం టీడీపీతోనే సాధ్యం అన్నారు. ప్రజలు తనను, ఎంపీగా లావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభాధ్యక్షునిగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య వ్యవహరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి స్థానిక సమస్యలను ఎంపీ, కన్నా దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, టీ వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో కన్నా, పక్కన బాజీ చౌదరి, శౌరయ్య, సాయికృష్ణ

కన్నా, లావులకు బ్రహ్మరథం

సత్తెనపల్లి నియోజక వర్గ కూటమి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు, నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలకు శుక్రవారం రాత్రి కుంకలగుంట ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో కన్నా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార వాహనంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కన్నాను, లావును గజమాలలతో పార్టీ శ్రేణులు సత్కరించారు. బాణసంచా పేలుస్తూ ఎన్నికల ప్రచార యాత్ర పండుగను తలపింప చేసింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో పార్టీ జెండాల రంగులతో, డప్పు వాయిద్యాలతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, వజ్రగిరి జయారాజు, బాదినేడు సుబ్బారావు, ఎం.సైదారావు, గోపు శ్రీనివాసరావు, సాతులూరి అప్పారావు, శ్రీను నాయక్, తాండ్ర వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కుంకలగుంటలో చేరికలు ..

వైసీపీ నుంచి టీడీపీలోకి కుంకలగుంట ఉప సర్పంచ్ సింగరాజు అంకారావు, రామిశెట్టి ఈశ్వరయ్య, సింగరాజు చౌడయ్య, తాడికొండ సుబ్బారావులు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీ నేతలు సాదరంగా ఆహ్వానించారు. కుంకలగుంటలో శుక్రవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభతో టీడీపీ తరుపున పోటీ చేస్తున్న కన్నా, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు జోష్ పెంచింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రవేశపెట్టింది టీడీపీయే..

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు ఎనలేనివి
- అధికారంలోకి రాగానే అంబేద్కర్ విదేశీ విద్య పేరును పునరుద్ధరిస్తాం
- బీజేపీపొత్తుతో ముస్లింలు ఆందోళన చెందవద్దు
- డాక్టర్‌పెమ్మసాని చంద్రశేఖర్



రేటూరు రోడ్ షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని పక్కన బీ. రామాంజనేయులు, తదితరులు

కాకుమాను, ఏప్రిల్ 19: రాష్ట్రంలో సంక్షేమాన్ని ప్రవేశపెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాలలో శుక్రవారం రోడ్ షోలతో పాటు, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు మహిళలు, స్థానికులు ఎదురేగి వెళ్లి స్వాగతం పలికారు.

తొలుత రేటూరులో రోడ్ షోలో చర్చి వద్ద బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడా విదేశాల్లో విద్యనభ్యసించారని తెలిపారు. హక్కుల పోరాటాల నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. స్ఫూర్తి ప్రదాత విగ్రహాల వలన ప్రేరణ పొంది సమాజానికి మంచి చేయాలని స్థానికులకు సూచించారు. అమరావతి రాజధానిలో 125 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతి వనాన్ని చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యంలో చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు విదేశాలలో విద్యనభ్యసించాలనే ఉద్దేశ్యంతో అంబేద్కర్ విదేశీవిద్య పేరుతో వారికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ విదేశీ విద్య పేరును తొలగించారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 2 లేదా 3 సెంట్ల ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మసీదు వద్ద జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఆందోళన చెందవద్దన్నారు. బీజేపీతో పొత్తు అవసరం గురించి వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్డీయే అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి అభ్యర్థిగా భారతరత్న అబ్దుల్ కలాం ఆజాద్ పేరును సూచించి ఆయన గెలుపుకు పాటు పడ్డారన్నారు. అధికార వైసీపీ పార్టీ నుంచి గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు, రషీద్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం అప్పాపురంలో జరిగిన రోడ్డు షోలో స్థానిక బొడ్డురాయి సెంటర్ వద్ద జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ గ్రామాలలో తాగు, సాగు నీరు సమస్యలు ఉన్నాయని చెప్పారు. సాగు నీరు సమస్యకు సీఎం జగన్ పరోక్షంగా కారకుడని తెలిపారు. రైతులకు సాగుకు, ప్రజల త్రాగు నీరు, వాడుక నీరు అవసరాల గురించి పాలకుడికి అవగాహన లేకపోతే కొమ్మమూరు కెనాల్ ప్రక్క గ్రామాలకు కూడా నీటి ఎద్దడి ఏర్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌ల గురించి ప్రజలు అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్‌లో చాలా ప్రమాదాలు అని స్థానికులకు వివరించారు. మద్యంపై, ప్రజల ఆస్తులపై తాకట్టు పెట్టారని వివరించారు. ఉమ్మడి ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం జగన్‌కు కక్ష సాధింపు చర్యల రాజకీయాలకు తప్ప అభివృద్ధి తెలియదని అన్నారు. వలంటీర్‌ల ద్వారా ప్రజల డేటాను స్వీకరించారని తెలిపారు. ఆ డేటా ఎవరి వద్ద ఉందో కూడా తెలియని పరిస్థితికి జగన్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు అగస్టీన్, రాంగోపాల్, వీరయ్య చౌదరి, నువ్వుల సునీల్ చౌదరి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారు

- ఎమ్మెల్యే అనుచరులేనని బాధితుడి ఆరోపణ



భూమి డాక్యుమెంట్‌లను చూపిస్తున్న సూర్యనారాయణ

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 19: ఉప్పలపాడు వద్దగల తన రెండెకరాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని నరసరావుపేట మండలం లింగం గుంట్లకు చెందిన చంద్రా సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని జగనన్నకాలనీ సమీపంలోని కబ్జాకుగురైన తన భూమిని, డాక్యుమెంట్ చూపించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులైన బండి వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి తన భూమిని అక్రమించారన్నారు. కర్నూలు-గుంటూరు హైవే పక్కనే ఉన్న ఆ భూమి విలువ ఇప్పుడు రూ.15 కోట్లు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఈ మధ్య ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి భూమి వివరాలు అందజేశానని, ఆయన నాకు ఏమి సంబంధం లేదని చెప్పారన్నారు. ఎమ్మెల్యేని కలిసిన తర్వాత తన భూమిలో షెడ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము విజయవాడకు చెందిన వారి వద్ద కొన్నాం.. ఎమ్మెల్యే అనుచరుడైన నరసింహారెడ్డి మాట్లాడుతూ తాము ఉప్పలపాడు వద్ద ఆ భూమిని విజయవాడకు చెందిన వారివద్ద కొన్నామని ఫోనులో వివరించారు. సూర్యనారాయణ స్థానికుడు కావడంతో విజయవాడ వాళ్ళను భూమిలోకి రాకుండా చేయడానికి ఏవేవో చెబుతున్నారని, అతని వద్ద ఎలాంటి డాక్యుమెంట్‌లు లేవన్నారు.

అతిసారతో మంచం పట్టిన మంచాల

- కలుషిత నీటితో ప్రబలిన డయేరియా
- ఏ గృహానికి వెళ్లిన బాధితులే
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులలో ఆగ్రహం

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్19: చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో అతిసార ప్రబలింది. గ్రామంలో సుమారు 50 మందికి పైగా బాధితులు ఉన్నారు. గ్రామంలో కలుషిత నీరు వల్ల అతిసార ప్రబలిందని ప్రజలు ఆరోపించారు. గత రెండు రోజులుగా అతిసార విజృంభిస్తుంటే వైద్యాధికారులు కానీ, అధికారులు కానీ ఆ గ్రామం వైపు కన్నెతి చూడని పరిస్థితులు నెలకొన్నాయి. రెండు రోజుల క్రితం పదుల సంఖ్యలో ప్రజలు స్వల్ప లక్షణాలతో బాధపడటం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం 50 మంది వరకు ఆసుపత్రి పాలు కావటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కలుషిత నీరే డయేరియా ప్రబలటానికి కారణం అన్ని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం అతిసారా బాధితులు పెరిగిపోవటంతో వైద్యాధికారులు ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామంలో 35 మంది వరకు ఇంటి వద్దనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఎనిమిది మందికి వ్యాధి తీవ్రత పెరగటంతో చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.



చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికత్స పొందుతున్న అతిసార బాధితులు

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..

మంచాల గ్రామంలో అతిసార బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం అని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మంచాలను డీఎం అండ్ హెచ్‌వో సందర్శించారు. అతిసార వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేయించిన్నట్లు చెప్పారు. అత్యవసర చికిత్స కోసం తరలించటానికి వీలుగా అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉండి పరిస్థితి చక్కపడే వరకు నిరంతర పర్యవేక్షణ చేయనునట్లు డీఎం అండ్ హెచ్‌వో తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, బీసీ సంక్షేమం సంఘం ప్రతినిధులు

అన్నివర్గాల మద్దతు కూటమికే..

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 19: ఏ వర్గాన్ని వదిలి పెట్టకుండా అందరినీ అన్నిరకాలుగా సీఎం జగన్ రెడ్డి వేధింపులకు గురిచేశాడని, ఆ బాధిత వర్గాలందరూ ఇప్పుడు కూటమికే మద్దతు పలుకుతున్నారని మాజీ మంత్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో ప్రత్తిపాటిని ఆంధ్రప్రదేశ్ బీసీసంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలు, ఎస్సీలపై జరుగుతున్న దాడుల నియంత్రణ కోసం ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏకు మద్దతుగా ఉంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని వారు శాలువాతో సత్కరించారు. అనంతరం పుల్లారావు బీసీనేతలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాన్యుడికి కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిని సీఎం జగన్‌రెడ్డి కల్పించారన్నారు. ప్రజలను అవస్థల పాలుచేస్తూ, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూన్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి అక్రమ సంపాదనతో

జగన్‌రెడ్డికి డబ్బులు ఉన్నాయి కదా? అని సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లల్లో సర్వేలు వేయించుకోవటం తప్ప వాస్తవ సర్వేలన్నీ ఏకపక్షంగా టీడీపీ కూటమి గెలవబోతుందని చెపుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో ఏ సర్వే చూసినా కూటమికి 20కి పైగా లోక్‌సభ సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయన్నారు. అలాగే 160 అసెంబ్లీ సీట్లు గెలిచే స్థాయికి కూటమి ఖాయంగా కన్పిస్తోందన్నారు. రైతులు, యువతకు ముఖ్యమంత్రి తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఏమీ అమలు కాలేదన్నారు. చేయూత బటన్ నొక్కినట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా ఎవరి ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. విద్యా దీవెన డబ్బులు పరిస్థితి కూడా అదే అన్నారు. ఇన్నిచేసి అబద్ధాలు, మోసంతో పొద్దుబుచ్చుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపటం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. వైసీపీ దోపిడీ పర్వంలో 175 నియోజక వర్గాల్లో చిలకలూరిపేట, ఇక్కడి అవినీతి మంత్రి మొదటి స్థానంలో ఉంటారన్నారు. అనంతరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ మాట్లాడుఏతూ బీసీల అభ్యున్నతి కోసం చంద్రబాబు, పవన్ పాటు పడుతున్నారని, జగన్ బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకుండా చేశారని దుయ్యబట్టారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని, వారిపై దాడులు జరగకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీ రక్షణ చట్టం తెస్తామన్నారు. కేంద్రంలో ప్రధానిగా బీసీ కులానికి చెందిన మోదీ ఉన్నారని, రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి పాల్పడే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉన్నారని, బీసీలు, మైనార్టీలు వారిని ఆశీర్వదించాలని రాజా రమేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి భానుగుంట్ల శ్రీనివాసరావు, నియోజక వర్గ అధ్యక్షులు కాకుమాను రమేష్, జిల్లా నాయకులు వెంకటరావు, కూరపాటి శివ శంకర్, పట్టణ అధ్యక్షుడు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల హల్‌చల్

- టీడీపీ డీజేపై పెట్రోలు పోసి నిప్పంటించే యత్నం

బెల్లంకొండ, ఏప్రిల్ 19: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలపై ప్రతిఘటించటంతో ఘర్షణ తగ్గుముఖం పట్టించింది. విషయం తెలుసుకున్న బెల్లంకొండ ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించి బాధితుడిని చంద్రాజుపాలెం వైసీపీకి చెందిన గాదె నాగార్జునరెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరువర్గాలను పిలిపించి బైండోవర్ చేస్తానని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు బెల్లంకొండ పోలీసు స్టేషన్‌కు వద్దకు చేరుకొని టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అరుణాచలంనకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, ఏప్రిల్ 19: ఈనెల 23న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్‌సలాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 21న రాత్రి 9.15 గంటలకు బయ ల్దేరి 22న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజురాత్రి అక్కడే బసచేసి 23న పౌర్ణమిరోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. ఆరోజే సాయంత్రం బయల్దేరి 24న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుంద న్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. చార్జీ ఒక్కరికి రూ.2420 ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 73828 97459 నంబరును సంప్రదించాలని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం కోరారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల్లో
గందరగోళం

- ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల విధానం గందర గోళంగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్ చెబుతూ ఉండటంతో దరఖాస్తు దారులు విస్తుపోతున్నారు. గత ఎన్నికల్లో ఎక్కడ విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు ఓటు ఉన్న నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు ఇస్తే ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయించేవారు. కానీ ఇప్పుడు అధికారులు చెబుతున్నది చూస్తే ఇందుకు భిన్నంగా వినపడుతుంది. ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా పని చేస్తున్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఇవ్వాలని, వాటిని స్క్రూట్నీ చేసి ఆయా నియోజకవర్గాలకు పంపిస్తారని మళ్ళీ అక్కడి నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను పని చేస్తున్న నియోజకవర్గానికి పంపుతారని, ఓటు వేశాక వాటన్నిటిని మళ్ళీ ఓటు ఉన్న నియోజకవర్గానికి పంపించే విధానాన్ని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడ తప్పు జరిగినా దరఖాస్తు దారు ఓటు హక్కు కోల్పోతారు. కొన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగి ఏ జిల్లాలో పని చేస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గంలో ఓటు ఉంటే దరఖాస్తు తీసుకుంటుండగా మరి కొన్ని నియోజకవర్గాల్లో తిరస్కరిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఏ నియోజకవర్గంలో ఏ నిబంధన అమలవుతుందో తెలియడం లేదంటూ వాపోతున్నారు. ఎన్నికల అధికారులు దీనిపై దృష్టి సారించి ఓటు ఉన్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు తీసుకుని అక్కడే ఫెసిలీటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు

టీడీపీలోకి వైసీపీ మాజీ ఎంపీటీసీలు

దాచేపల్లి, ఏప్రిల్ 19: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో నారాయణపురంకు చెందిన మాజీ ఎంపీటీసీలు, వడ్డెర కార్మిక నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. నారాయణపురం మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు విష్ణుమూర్తిలు, నడికుడి గ్రామానికి చెందిన వడ్డెర కార్మిక నేతలు, వడియ రాజుల సామాజికవర్గానికి చెందిన పల్లపు కృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శంకరశివ, మోహన్‌రావు, నరసింహారావు, గురవారావు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, తమ్మిశెట్టి శంకరరావు, శ్రీనుబాబు, ముదిరాజులకు చెందిన వెంకటేష్, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన కౌన్సిలర్ చంటీశ్వరి వెంకట నారాయణ తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : పట్టణంలోని 2వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ ఎం.చంటీశ్వరి వెంకట నారాయియణ శుక్రవారం వైసీపీని వీడి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. భార్యభర్తలు ఇద్దరికి కన్నా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కన్నా లక్ష్మీనారాణ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, దేవతి శివ ప్రసాదు, నూర్‌బాషా జానీబాబు, గుంటూరు ఆశీర్వాదం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌రెడ్డి దెబ్బకు రోడ్డున పడ్డాం

- ఐదేళ్లపాటు అబద్ధాల కోరు పాలనే.. ● 1585వ రోజుకు ఆందోళనలు..



వెంకటపాలెంలో ధర్నా శిబిరంలో మహిళలు ఆందోళన

తుళ్ళూరు, ఏప్రిల్ 19: జీవనాధారమైన తమ భూములు రాజధాని అమరావతి కోసం ఇస్తే.. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానుల మూడుముక్కలాట దెబ్బకు రోడ్డున పడ్డామని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతి రాజధానిని కొనసాగించాలంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు శుక్రవారం నాటికి 1585వ రోజుకు చేరుకున్నాయి. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్ర ప్రగతిని దెబ్బతీసే వైసీపీని ఈ ఎన్నికలల్లో ఇంటికి పంపాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

77,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 67,994 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 77,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,032 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	15500
273	10000	14000
341	8000	17500
4884	11000	15500
సూపర్ 10	9000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘననివాళి


గౌతులచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న జయప్రకాష్ నారాయణ తదితరులు

బాపట్ల,ఏప్రిల్ 19 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్‌గౌతు లచ్చన్న వర్ధంతిని శుక్రవారం బాపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ సంఘీయులతో కలిసి కొత్తబస్టాండ్‌లోని గౌతు లచ్చన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడా రు. కార్యక్రమంలో సంఘనాయకులు కర్పూరపు రామారావు, మరీదు వెంకటేశ్వర్లు, మునేశ్వరరావు, పరిశా రమేష్‌గౌడ్, మురళీ, ఉప్పాల మురళీ పాల్గొన్నారు.


వైద్యసిబ్బందికి అవగాహన పత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వరరావు

ఏరియా వైద్యశాలలో అగ్నిమాపక అవగాహన సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 19 : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఏరియా వైద్యశాల, వ్యవసాయ కళాశాల రోడ్డులోని స్టార్ హాస్పటల్‌లో అగ్నిమాపక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వరరావు ఆసుపత్రి సిబ్బందికి, యాజమాన్యంకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరులో ఎన్నికల అవగాహన ర్యాలీ

వేమూరు, ఏప్రిల్ 19 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవో శేషగిరిరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేమూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్, సచివాలయాల ఉద్యోగులు, యానిమేటర్లు ప్రధాన కూడళ్లలో నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, దానిని ప్రతి ఒక్కరూ ఆలోచించి సద్వినియోగపర్చుకోవాలన్నారు.



ఎన్నికల ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఉద్యోగులు

ఘనంగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు

కర్లపాలెం, ఏప్రిల్ 19 : కర్లపాలెం పాతయూనియన్ బ్యాంక్ సమీపంలో ఆర్యవైశ్య సంఘ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, వాసవిక్లబ్ వాసవి క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించామని కమిటీ సభ్యులు తెలిపారు. పుచ్చా బాలకృష్ణ ఆధ్వర్యంలో కె.ప్రభాకర్, లక్ష్మీకుమారిలచేత శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉటుకూరి శ్రీనివాసరావు, సామా ప్రసాద్, నవతా సుబ్బారావు, పడవల నరేంద్రనాథ్, బొమ్మిశెట్టి కిషోర్‌కుమార్, తడికమళ్ళ హేమంత్ పాల్గొన్నారు.

కొత్రావారి వీధిలో అన్నదాన కార్యక్రమం

బాపట్ల, ఏప్రిల్ 19 : శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కొత్రావారివీధిలో ఉన్న శ్రీరామాలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులతోపాటు కొత్రా ఏడుకొండలు భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

11మంది వలంటీర్లు రాజీనామా

వేమూరు, ఏప్రిల్ 19 : మండలంలోని జంపని రెండు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా పత్రాలు సమర్పించారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థిగా నందిగం నామినేషన్

బాపట్ల, ఏప్రిల్ 19 : వైసీపీ ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి బాపట్లలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషాకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అదేవిధంగా బహుజన సమాజ్‌వాది పార్టీ ఎంపీ అభ్యర్థిగా డొక్కా జగన్మోహనరావు నామినేషన్ దాఖలు చేశారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోన...

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోన రఘుపతి మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన భార్య కోన రమాదేవి కూడా రెండో రోజు మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమానికి ముందు భావన్నారాయణస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం జీబీసీ రోడ్డులో రోడ్డుషో నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి జనసేనలో చేరిన పది కుటుంబాలు


వైసీపీ నుంచి జనసేనలో చేరిన కార్యకర్తలతో ఆ పార్టీ నాయకులు రాజేష్, చలమయ్య

కొల్లూరు, ఏప్రిల్ 19: వైసీపీని వీడి పది కుటుంబాలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. శుక్రవారం మండలపరిధిలోని పెదలంక గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు గొల్లపూడి శ్రీనివాసరావు, తోట రాంబాబు, గొల్లపూడి శివప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, తోట సుబ్రహ్మణ్యం, కోర్ల భాగ్యరాజు, బర్మా వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావులతో పాటు మరికొన్ని కుటుంబాలకు చెందిన వారు పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై కొల్లూరు జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య ఆధ్వర్యంలో వేమూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్ సమక్షంలో తెనాలిలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కొల్లూరు, ఏప్రిల్ 19: వస్త్ర దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తి ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీన కొల్లూరులో సోడాబత్తిన బుజ్జి అనే మహిళ వస్త్ర దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ కౌంటర్‌లోని రూ.2 వేలు అపహరించుకు పోయాడు. ఈ విషయమై దుకాణ యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి పాల్పడిన వ్యక్తి కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన జి.గణేష్ బాబుగా గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.


కోసూరివారిపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్


ధూళిపూడి గ్రామంలో భారీ గజమాలతో ఎమ్మెల్యే అనగానిని సన్మానిస్తున్న గ్రామస్థులు

సూపర్-6 పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు

- ప్రచారంలో ఎమ్మెల్యే అనగాని
- భారీ గజమాలతో స్వాగతం పలికిన ప్రజలు

రేపల్లె, ఏప్రిల్ 19: మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నా రు. శుక్రవారం నిజాంపట్నం మండలం కోసూరివారిపాలెం, ఆము దాలపల్లి, నగరం మండలం ధూళిపూడి, అద్దంకివారిపాలెం, ఇసు కపల్లిలోని యాదవ పాలెంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారం లో వేలాది మంది ప్రజలు పాల్గొని ఎమ్మెల్యే అనగానికి భారీ గజమాలతో ధూళిపూడి, అద్దంకివారిపాలెం గ్రామస్థులు స్వాగతం పలికారు. ప్రచారంలో ఎమ్మెల్యే అనగానిపై పూలవర్షం కురిపిస్తూ మహిళలు హారతులు పెట్టారు. అన్న మూడోసారి విజయం నీదే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తెలుగుదేశం పార్టీ కూటమిని ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో జగన్ పాలనలో విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యునిపై అధిక భారం మోపారన్నారు. మద్య నిషేధం గాలికి వదిలేసి సొంతంగా మద్యం వ్యాపారం చేస్తూ నాసిరకం మద్యంతో పేదల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. తీరప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని మీరంతా నాకు అండగా నిలిచి నా గెలుపునకు కృషి చేయాలని కోరారు. రేపల్లె పట్టణంలోని ఇసుక


ఇసుకపల్లి యాదవపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

పల్లి యాదవపాలెంలో ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్‌లు గెలుపునకుప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎన్డీయే కూటమిని బలపరిస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమం లో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జడ్పీటీసీ మేకా వెం కట శివరామకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, వుయ్యూరు భీమేష్‌కుమార్, యతీస్‌కుమార్, లుక్కా గుడారంకయ్య, పిన్నిబోయిన చింతారావు, విచారపు కుటుంబరావు, పేరం జయశీలరావు, పట్టణంలో గుర్రం మురహరిరావు, దండుప్రోలు పిచ్చియ్య, పంతాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

- జగన్ పాలనలో దోపిడీ ఫ్యాక్షనిజం
- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు ఏప్రిల్ 19: తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో సం క్షేమం అభివృద్ధి పరిఢవిల్లితే, జగన్ పాలనలో దోపిడి, ఫ్యాక్షనిజానికి పదును పెట్టారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు అన్నారు. శుక్రవారం చుండూరు, మున్నంగివారిపాలెం, అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడు తూ జగన్ ఐదు సంవత్సరాల పాలనా కాలాన్ని ప్రజలు ఒక పీడకలగా భావిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చాయలు కనిపించలేదు. నియోజకవర్గాన్ని నిలువు దోపిడి చేసిన అధికార పార్టీ నాయకుడు తిరిగి గెలిచే అవకాశం లేదని ముందనే గ్రహించుకుని నియోజకవర్గం నుంచి పరారయ్యాడని అన్నారు. పంటలకు సాగునీరు అందించలేకపోవడం,


ఆనందబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆనందబాబు

పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, చిన్న, సన్నకారు రైతులు, కౌలు దారులు నష్టాలను మూటకట్టుకున్నారు. కొన్ని గ్రామాల్లో అప్పులపాలపైన రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో యథేచ్ఛగా మట్టి దోపిడి, జూదం, మద్యం, కోడి పందాలు ద్వారా దోపిడికి పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించి రాష్ట్రానికి పూర్వవైభవం కల్పించడానికి కూటమిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, మండల అధ్యక్షుడు గూదే టి ఎల్లారెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఊసా రాజేష్, మండలాధ్యక్షుడు శ్రీరామమూర్తి, జి.కోటిరెడ్డి, భీమవరపు శ్రీమాన్, కుర్రి వెంకటరెడ్డి, దేవిరెడ్డి నాగేశ్వరరావు, ఆళ్ళ వెంకట సుబ్బారెడ్డి, రాహుల్, శరత్‌చంద్ర, కందిమళ్ళ వసంత పాల్గొన్నారు.

రోడ్లపైకి వచ్చిన వైసీపీ శ్రేణులు.. తీవ్ర ట్రాఫిక్ ఇక్కట్లు

- ఆర్‌వో కార్యాలయం వైపు చొచ్చుకు వచ్చే ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- వైసీపీ శ్రేణులు నుంచి బాణా సంచా స్వాధీనం

బాపట్ల, ఏప్రిల్ 19 : బాపట్ల పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా కోన రఘుపతి, నందిగం సురేష్‌లు శుక్రవారం నామినేషన్ దాఖలు చేసే ముందు పెద్ద ఎత్తున రోడ్డుషో ఏర్పాటు చేశారు. జీబీసీ రోడ్డులోని శ్రీనివాస్ థియేటర్ పక్కనే రైస్‌మిల్లు దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్, గడియారస్తంభం సెంటర్ మీదగా పాతబస్టాండ్ వరకు నిర్వహించిన రోడ్‌షో వల్ల వైసీపీ శ్రేణులంతా జెండాలు పట్టుకొని రోడ్డుపైకి వచ్చారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. బస్సులు, ఆటోల రాకపోకలకు విఘాతం ఏర్పడింది. వాహనాలలో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైసీపీ శ్రేణులు మాత్రం రోడ్లపై బాణా సంచాకాలుస్తూ, కేరింతలు కొడుతూ డీజే సౌండ్‌లతో డ్యాన్స్‌లు చేశారు. గమనించిన పోలీసులు బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి నామినేషన్ వేయటానికి ఆర్‌వో కార్యాలయానికి వెళుతుండగా వైసీపీ శ్రేణులు ఆయనతోపాటు వచ్చేందుకు భారికేడ్‌లు నెట్టుకొచ్చే ప్రయత్నం చేశారు. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అలాగే ట్రాఫిక్‌ను మళ్ళించి వాహనాలను పంపించారు. దీనివల్ల రెండు గంటలకుపైగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


ఆర్వో కార్యాలయం వైపు చొచ్చుకొని రావటానికి ప్రయత్నిస్తున్న వైసీపీశ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు


వైసీపీశ్రేణులు కాలుస్తున్న బాణా సంచాను స్వాధీనం చేసుకొని తీసుకెళుతున్న పోలీసులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

రేపల్లె, ఏప్రిల్ 19: నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీసీతారాముల స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ అనువంశిక ధర్మకర్త యల్లాప్రగడ శేషకల్పసాయి రంజని దంపతులు ఆధ్వర్యంలో పిన్నేటి భార్గవ్ ఆనంద్, హేమలత, కొలసాని తిరుపతయ్య, కోటేశ్వరమ్మ, కొలసాని వీరభద్రరావు, లక్ష్మీరాజ్యం దంపతులు ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు.

నల్లమోతువారిపాలెంలో మహిళ అదృశ్యం

కర్లపాలెం, ఏప్రిల్ 19 : మండలంలోని నల్లమోతువారిపాలెం గౌడపాలెంలో శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ముగ్గు వేస్తున్న కాటూరి శివనందిని అదృశ్యమైందని భర్త కాటూరి శ్రీనాధ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జనార్దన్ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

బాపట్ల, ఏప్రిల్ 19 : పట్టణంలోని ధరివాదకొత్తపాలేనికి చెందిన కాసు రేవతిని భర్త కోటిరెడ్డితోపాటు బంధువులు అధిక కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారంటూ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై రజాక్ తెలిపారు.

యశోద మృతికి పలువురి సంతాపం

బాపట్లరూరల్, ఏప్రిల్ 19 : బాపట్ల మండలం గుడిపూడి గ్రామ పంచాయతీ మాజీసర్పంచ్ కందేపు సుబ్బారావు సతీమణి కందేపు యశోద (80) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. మృతురాలి భర్త సుబ్బారావు గుడిపూడి గ్రామానికి ఐదు పర్యాయాలు సర్పంచ్‌గా చేశారు. యశోద మృతికి పలువురు ప్రముఖులు సంతాపాన్ని తెలిపారు. గుడిపూడిలో శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

రేపల్లె, ఏప్రిల్ 19: ఎన్నికల్లో భాగంగా రెండో రోజు నామినేషన్లు ఎవరూ వేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు.

నేడు టీడీపీ మండల సమావేశం

భట్టిప్రోలు, ఏప్రిల్ 19: మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఈ నెల 22న నామినేషన్ వేయనున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ వాకా శేషుబాబు తెలియజేశారు. స్థానిక మార్కెట్‌రోడ్డులో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని సమీక్ష నిర్వహిస్తారన్నారు.

నేడు టీడీపీ, జనసేన సర్వసభ్య సమావేశం

కొల్లూరు, ఏప్రిల్ 19: టీడీపీ, జనసేన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఘైనేని మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22న కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్ వేయనున్నారని, శనివారం ఉదయం 11 గంటలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే సమావేశానికి మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి పాల్గొని దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

ఉభయ రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొల్లూరు, ఏప్రిల్ 19 : ఉభయ రామలింగేశ్వరస్వామి ఆలయ సహస్రాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని చిలుమూరులో ఉభయ రామేశ్వర క్షేత్రంలో శైకత లింగాన్ని ప్రతిష్ఠించి ఐదు సంవత్సరాలు పూర్తి కావడం తో శుక్రవారం నుంచి బుధవారం వరకు సహస్రాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. ఏకాదశి సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయని, పేరంటాళ్లమ్మ, గంగానమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, కొత్తచిలుమూరులోని అంకమ్మ అమ్మవారికి పసుపు, కుంకు మ, సమర్పించినట్లు, ఉభయాంజనేయస్వామికి ఆకుపూజ, రాత్రివేళ ఉభయ రామేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయాల్లోని స్వామివార్లకు ధ్వజారోహణ, తీర్థప్రసాద వితరణ చేసినట్లు ధర్మకర్త తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

విధ్వంసకారి ముఖ్యమంత్రి జగన్

- నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండండి
- మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 19 : ముఖ్యమంత్రి జగన్ విధ్వంసకారి అని ప్రతి గ్రామాన్ని వర్గ విభేదాలతో రెచ్చగొడుతున్నాడని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం వేమూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంలో కోడికత్తి కేసు డ్రామా సృష్టించిన జగన్ తిరిగి ఎన్నికల సందర్భంలో గులకరా యి డ్రామాకు తెరలేపారని అన్నారు. దాన్ని కూడా హత్యాయత్నంగా మార్చాడని అన్నారు. బాబాయిని హత్య చేసి చంద్ర బాబుపై ఆ నేరాన్ని రుద్దాడని, తిరిగి గులకరాయి డ్రామా కూడా అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బోండా ఉమపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నార న్నారు. వేమూరు నియోజకవర్గంలో ప్రజలు కలసి మెలసి జీవనం సాగిస్తుంటారని అలాంటి ప్రశాంతమైన వాతావరణాన్ని మేరుగ నాగార్జున మంత్రి స్థాయిలో ఉండి కలుషితం చేశారన్నారు. ఎన్నికలకు ఆరు నెలలు ముందే వలస వెళ్ళాడని విమర్శించారు. ప్రకాశం జిల్లా కొండేపిలో ఇన్‌చార్జిగా ఉండి అక్క డ ప్రజల చేత ఛీ కొట్టించుకున్న అశోక్‌బాబు నియోజకవర్గానికి వచ్చారన్నారు. ఆయన విచిత్రమైన పోకడలతో ప్రజలను రెచ్చగొడుతున్నాడని ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేశాడన్నారు. రైతులు కులాల మధ్య చిచ్చుపెట్టిస్తున్నాడని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో తిరుగుతున్న వలస పక్షులకు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలు ఆలోచించి అసెంబ్లీ బరిలో ఉన్న తనతో పాటు ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను కూడా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజ యబాబు, నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా జనసేన పార్టీ మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనూరాధ పాల్గొన్నారు.

22న ఆనందబాబు నామినేషన్ దాఖలు

వేమూరు, ఏప్రిల్ 19: వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబా బు ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం వేమూరు తహసీ ల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ర్యాలీ లతో పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న

రేపల్లె, ఏప్రిల్ 19: పేద బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యు న్నతి కోసం సర్ధార్ గౌతు లచ్చన్న ఎంతో పోరాటం చేశారని ఎమ్మె ల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం లచ్చన్న 18వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఉప్పూడి రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరా వు, జీవీ నాగేశ్వరరావు చెన్ను నాగమల్లేశ్వరరావు, తాతా ఏడుకొండలు, జీపీ రామారావు, పంతాని సాయికుమార్, కేసన సురేందర్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, కేసన రామకృష్ణ, జనసేన నాయకులు చిలకలపూడి పాపారావుయి తదితరులు పాల్గొన్నారు.


సర్ధార్ గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రాష్ట్ర అభివృద్ధి ఎన్డీయే కూటమితోనే సాధ్యం

రేపల్లె, ఏప్రిల్ 19: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం నిజాంపట్నం మండలం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, దండుప్రోలు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిజాంపట్నం మండలం నక్షత్రనగర్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పార్టీలో నూతనంగా వచ్చిన వారికి సముచిత స్థానం కల్పించి వారికి అండగా ఉంటామని అనగాని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనగాని హ్యాట్రిక్ ఖాయం

రేపల్లె, ఏప్రిల్ 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అన గాని సత్యప్రసాద్ హ్యాట్రిక్ సాధించనున్నారని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం నగరం మండలం పెద్దపల్లి పంచాయతీలోని గొల్లపాలెం, మాల పల్లి, నిజాంపట్నం మండలం పల్లపట్ల, ముత్తుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపు కోరుతూ దళిత నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దున్నా జయప్రద, చుక్కా కోట య్య, నన్నా జయరావు, క్రాంతి వినోద్, చంద్రబాబు, గొర్రె సత్య నారాయణ, దున్నా సంగీతరావు, అలూరి దానియేలు, ఎమ్మార్పీ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకే ఎగ్జిబిషన్

భట్టిప్రోలు, ఏప్రిల్ 19: విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించేందుకు వెర్బ్ టెన్సెస్‌పై ఎగ్జిబిషన్‌ను నిర్వహించినట్లు ఆంగ్ల ఉపా ధ్యాయుడు పి.హరికృష్ణ తెలియజేశారు. మండలంలోని ఐలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెర్బ్ టెన్సెస్‌పై ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష వ్యక్తీకరణ నేటి పోటీ ప్రపంచంలో చాలా అవసరమన్నారు. ఆంగ్లంలో రాయడానికి, మాట్లాడటానికి ప్రధానంగా వెర్బ్ టెన్సెస్ ఆవశ్యకత ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వినూత్నరీతిలో బోధన ద్వారా ప్రదర్శన చేశారు. ఎంఈవో ఎస్.దేవరాజ్ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాచర్ల మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓట్లు.. పాట్లు

- గ్రూపులు కడదాం.. ఓట్లు కొల్లగొడదాం...!
- గంపగుత్త ఓట్లపై నేతల దృష్టి
- వివిధ సంఘాల సమావేశాలతో నేతల బిజీబిజీ
- వాట్సాప్ గ్రూపుల అడ్మిన్‌లపైనా గురి
- వారి కోర్కెలకు జై కొడుతున్న పార్టీలు


బాపట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు వాట్సప్ గ్రూపులను కూడా వదలడం లేదు. అడ్మిన్లకు గాలం వేస్తూ ఓట్లు పోగేసుకునే పనిలో ఉన్నారు. ఇంకోవైపు ఆయా సంఘాల నేతలను, అపార్ట్‌మెంట్ల కమిటీలను, వివిధ అంశాల ఆధారంగా ఏర్పడిన సంఘాలుగా కూడా వదలడం లేదు. వారితో నేతలు బేరసారాలు సాగిస్తున్నారు. మరికొంతమంది ఇదే అదనుగా ఈవెంట్ మేనేజర్ల అవతారమెత్తుతూ గ్రూపుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఇంత చేస్తున్నా నేతలకు వారి ఓట్లు తమకే పడతాయన్న భరోసా కలగడం లేదు. దానికి ఒక్కటే కారణం ఈ రోజు తనతో సమావేశమయిన వారే మరో రోజు ప్రత్యర్థి పార్టీతో మంతనాలు జరుపుతున్నారు. అయినా సరే పదిమంది ఉన్న గ్రూపులను కూడా వదలకుండా వారి ఓట్లు కొల్లగొట్టడమే ధ్యేయంగా నేతలు ముందుకు సాగిపోతున్నారు.

యువకులకు డిమాండ్..

కొంచెం యాక్టివ్‌గా ఉండే యువకులు వారి వీధిలో ఉండే మరికొంతమందితో కలిసి ఓ గ్రూప్ ఏర్పాటు చేసుకుని రోజువారీ విషయాలు దానిలో పంచుకోవడం సహజమైపోయింది. ఇప్పుడు ఆయా గ్రూపుల అడ్మిన్‌లకు డిమాండ్ పెరిగింది. గ్రూపులో ఉన్న వారందరి మద్దతు తనకే దక్కేలా చేయాలని నేతలు అభ్యర్థిస్తుంటే క్రికెట్ కిట్ల దగ్గర నుంచి మోటార్ల బైక్‌ల వరకు సదరు యువకుల కోర్కెల చిట్టా నడుస్తోంది. వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు ద్వారా తల్లి దండ్రుల చేత చీవాట్లు తిన్న యువకులే నేడు నేతలకు ఓట్ల మారాజులుగా కనబడుతున్నారు. సమయం వారిది మరీ.

వ్యాపార సంఘాలు, కుల సంఘాలు...

చిరు వ్యాపారులు మొదలుకుని బిజినెస్ టైకూన్‌లుగా విరాజిల్లుతున్న వారంతా వారివారి వర్గీకరణలతో సంఘాలు నిర్వహిస్తూ ఉన్నారు. ఇదే విధంగా కుల సంఘాలు సైతం తమ తమ అంశాలపై పోరాటం చేస్తూ ఉన్నాయి. ఇప్పుడు నేతలందరికీ వీరు కావాల్సిన వారయ్యారు. వీరే కాదు చివరికీ చిట్టీపాట దారులను కూడా వదలకుండా ఓట్లనీ గంపగుత్తగా పడాలని నేతలు అభ్యర్థించడం వారి పాట్లకు అద్దం పడుతోంది.



సమీకరించడం తేలిక.. పెద్ద సంఖ్యలో ఓట్లు...

ఇంటింటీ ప్రచారాల కన్నా కూడా ఇలా సంఘాలు, గ్రూపులతో సమావేశాలు నిర్వహించి ఓట్లు అడగడం వల్ల పని తేలికవుతుంది. పెద్ద సంఖ్యలో ఓట్ల జల్లు కురిసే అవకాశం ఉంది. కానీ ఒక్కటే బెంగ నేతలకు పాపం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయనే. సమావేశాల కోసం మినీ హాలును వెతకాలి, విందుభోజనం ఏర్పాట్లు చేయాలి, వారి డిమాండ్లను సావధానంగా ఆలకించాలి. వాటిని నెరవేర్చాలి. ఇన్నీ చేసినా ఆ గ్రూపుల ఓట్లు తమకే పడతాయన్న భరోసా మాత్రం నేతలకు చిక్కడం లేదు పాపం.

రోజుకో పార్టీతో సమావేశం...

ఓ పార్టీ నేత ఓ గ్రూపుతో సమావేశమయ్యారని తెలుసుకున్న వెంటనే తెల్లారేసరికి మరో నేత అక్కడ వాలిపోతున్నారు. ఇదే అదనుగా వారు నిండైన డిమాండ్ల చిట్టాతో సదరు నేతను ఇదే అదనుగా ఆహ్వానిస్తున్నారు. అంతకు ముందు వచ్చిన పార్టీ నేతకన్నా అన్ని విషయాల్లో మెండుగా తాను చూసుకుంటానని హామీ ఇవ్వడంతో పాటు గ్రూపులు, సంఘాల వరాలు తీర్చడానికి నేతలు సన్నద్ధమైపోతున్నారు.

ఎవరినీ వదలడం లేదు....

ఇంటింటీ ప్రచారం జోరుగా చేస్తూనే ఈ గ్రూపులు, సంఘాలనూ వేటినీ వదలడం లేదు. చివరికి పది ఓట్లు ప్రభావితం చేసే శక్తి కలిగిన వారిని కూడా వదలకుండా వారితో విందుభోజనాలు ఏర్పాటు చేసి మరీ నేతలు ఓట్లపాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో వారు ఏ కోర్కె ముందుపెట్టినా అన్నింటికీ సై అంటున్నారే తప్ప సాధ్యాసాధ్యాల గురించి ఆలోచనే లేదు. పగలు ఊళ్లలో ప్రచారాలు, రాత్రిళ్లు గంపగుత్త ఓట్లపై గురిపెట్టి రహస్య సమావేశాలు ఇలా సాగుతోంది నేతల ఓట్ల వేట.

నమ్మకం చిక్కడం లేదు...

వాట్సాప్ గ్రూపులు, ఆయా సంఘాల నేతలతో ఎడతెరిపి లేకుండా సమావేశాలతో నిర్వహిస్తున్నా నేతలకు ఓట్ల విషయంలో గురి కుదరకపోవడంతో కంటిమీద కునుకు కరువవుతోంది. వారితో ఓ వైపు బేరసారాలు ఆడుతూనే మరో వైపు వారిని ఇంకాస్త గట్టిగా ప్రభావితం చేయగలిగే వ్యక్తుల కోసం దుర్భిణీ వేసి వెతుకుతున్నారు. అప్పటికీ ఓటు విషయంలో ఉపశమనం లభించకపోతే చేతిలో చెయ్యి వేసి సంఘాల నేతలతో చెప్పించుకుని కులాసాగా మరో గ్రూపువైపు అడుగేస్తున్నారు నేతాశయులు.



జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్

కూటమి అభ్యర్థుల నామినేషన్లు

- ఆర్‌వోలకు పత్రాలు సమర్పించిన తెన్నేటి, వేగేశన
- నరేంద్రవర్మ తరఫున సతీమణి వేగేశన హరికుమారి దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 19: బాపట్ల లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌భాషాకు లోక్‌సభ నియోజకవర్గానికి తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌కు వేగేశన నరేంద్రవర్మ తరపున ఆయన సతీమణి వేగేశన హరికుమారి మొదటిసెట్ నామినేషన్లను దాఖలు చేశారు. అంతకముందు శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలు పార్టీశ్రేణులు, కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఇరువురు అభ్యర్థులు ఆర్‌వోల కార్యాలయాలకు వెళ్లి మొదటిసెట్ నామినేషనన్లను సమర్పించారు. శుక్రవారం మంచిరోజు కావడంతో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశామని, మరోరోజు నామినేషన్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్ తెలిపారు. ఓటర్లంతా అండగా ఉండి తమను గెలిపిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు దొప్పలపూడి రామ్మోహనరావు, నాయకులు భీమా లీలాకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఆర్.వెంకటేశ్వర్లు, కళ్ళం హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భావన్నారాయణస్వామి దేవాలయంలో పూజల అనంతరం నామినేషన్ వేయటానికి బయలుదేరి వెళుతున్న వేగేశన నరేంద్రవర్మ, హరికుమారి దంపతులు, నాయకులు

రెండో రోజు 16 నామినేషన్లు

- బాపట్ల లోక్‌సభకు 3, అసెంబ్లీలకు 13

బాపట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల దాఖలుకు రెండో రోజైన శుక్రవారం మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అసెంబ్లీకి 13, లోక్‌సభ స్థానానికి 3 నామినేషన్లు వచ్చాయి. బాపట్ల లోక్‌సభ స్థానానికి టీడీపీ తరఫున తెన్నేటి కృష్ణప్రసాద్ నామినేషన్ వేయగా, వైసీపీకి నందిగం సురేష్ దాఖలు చేశారు. బహుజన్ సమాజ్‌పార్టీ తరఫున డొక్కా జగన్ మోహన్ నామినేషన్ వేశారు. ఇక అసెంబ్లీలకు వచ్చేసరికి అద్దంకిలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రెండు సెట్లు, చీరాలలో టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య, పిరమిడ్ పార్టీ తరఫున అంకమ్మగాంధీ, ఇండిపెండెంట్‌గా పినజల శాంతారామ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పర్చూరు నుంచి వైసీపీ తరఫున ఎడం బాలాజీ, పిరమిడ్ పార్టీ, జాతీయ సమసమాజంతో పాటు స్వతంత్ర అభ్యర్థిలతో కలుపుకుని మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బాపట్లలో టీడీపీ తరఫున వేగేశన నరేంద్రవర్మరాజు, వైసీపీ తరఫున కోన రఘుపతితో పాటు కోన రమాదేవి నామినేషన్లు దాఖలు చేశారు. వేమూరు, రేపల్లె నుంచి రెండో రోజు ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

టీడీపీకి వలంటీర్ల మద్దతు



మాజీ మంత్రి ఆనందబాబును కలసిన యడవూరు వలంటీర్లు

అమృతలూరు, ఏప్రిల్ 19: మండలంలోని యడవూరు గ్రామానికి చెందిన పది మంది వలంటీర్లు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారు. గ్రామానికి చెందిన వీరు తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో పనిచేయాలని నిశ్చయించుకుని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును శుక్రవారం కలిశారు. టీడీపీ - జనసేన కూటమి గెలుపొందేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ఆనందబాబుకు తెలిపారు. వీరి వెంట పార్టీ నాయకులు కుర్రా లక్ష్మీనారాయణ, బొంతా ఆంజనేయులు ఉన్నారు.

రౌడీషీటర్లపై నిఘా ఉంచాలి

- అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్




భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, ఏప్రిల్ 19: ఎన్నికల నేపథ్యంలో చెడు నడత కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్ దాఖలు ప్రక్రియ సజావుగా జరగాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైనందున జిల్లాలోని ఆర్‌వో కార్యాలయాల వద్ద విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ఆర్‌వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లే అవకాశం ఉంటే వారు సంబంధితాధికారులు నుంచి పొందిన అనుమతి పత్రాలను పరిశీలించాలన్నారు. అధికారులు నుంచి సరైన అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌వో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇద్దరు సీఎంలు.. ఇక్కడి వారే..

- ముఖ్యమంత్రులను అందించిన గడ్డ వేమూరు

వేమూరు, ఏప్రిల్ 18: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు నియోజకవర్గం ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన గడ్డగా గుర్తింపు పొందింది. కృష్ణానది ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఉద్దండ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారే కొణిజేటి రోశయ్య, నాదెండ్ల భాస్కరరావులు. వేమూరు పేరు తలవగానే వీరిద్దరూ గుర్తుకొస్తారు.



కొణిజేటి రోశయ్య



నాదెండ్ల భాస్కరరావు

- వేమూరు వాసి అయిన కొణిజేటి రోశయ్య గ్రామ పంచాయితీ వార్డు మెంబర్‌గా రాజకీయాల్లోకి అరంగ్రేటం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున 1968, 1974, 1980లలో శాసన మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. తొలిసారిగా మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో రోడ్లు రహదారుల శాఖ, రవాణాశాఖల మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత అనేక ముఖ్యమంత్రుల మంత్రి వర్గాల్లో పలు కీలకమైన శాఖలు నిర్వహించారు. 2004-2009కాలంలో 12వ శాసన సభకు చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నిక అయినప్పటికీ 2009ఎన్నికల ముందు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండా శాసన మండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలిలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉన్న రోశయ్య 2009సెప్టెంబర్ మూడు నుంచి 2010 నవంబర్ 24వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2011 ఆగస్టు 31న తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. 2016ఆగస్టు 30వరకు తమిళనాడు గవర్నర్‌గా తనదైన సేవలు అందించారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా, బాధ్యతలు నిర్వహించడమే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను 15సార్లు శాసన సభలో ప్రవేశపెట్టిన ఘనతను సాధించారు. 1995-1997 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజశేఖర్‌రెడ్డి మృతి చెందడంతో 2009సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఆయన 14నెలలు అధికారంలో కొనసాగిన తరువాత 2010లో నవంబర్ 24న తన పదవికి రాజీనామా చేశారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకులు వెంకయ్యనాయుడు రోశయ్యను స్వర్ణకంకణంతో సత్కరించి అభినందించారు.
- వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి చెందిన నాయుడు నాదెండ్ల భాస్కరరావు వృత్తిరీత్యా న్యాయవాది. 1978శాసన సభ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి శాసనసభ్యుడిగా అయ్యాడు. 1978నుంచి 1989వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులుగా కొనసాగిన కాలంలోనే మంత్రిగా క్యాబినెట్ మంత్రిగా ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి మంత్రి వర్గంలో టి.అంజయ్య మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. 1998ఖమ్మం నియోజకవర్గం నుంచి 12వ లోక్‌సభకు ఎన్నికై పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు 1982మార్చి 29న నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రామారావు మంత్రి వర్గంలో నాదెండ్ల భాస్కరరావు క్యాబినెట్ హోదా కలిగిన ఆర్థిక మంత్రిగా ప్రమాణం చేశారు. రామారావు ప్రభుత్వాన్ని గద్దె దించి గవర్నర్ సహకారంతో నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యారు. నాటి కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ల అప్రజాస్వామ్య వైఖరితో రాష్ట్రం అట్టుడికింది. ఫలితంగా సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రిగా తప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. తిరిగి రామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఒక్కసారే మహిళకు అవకాశం

- మాచర్ల నుంచి అసెంబ్లీకి వెళ్లిన దుర్గాంబ
- 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1999లో టీడీపీ అవకాశం



జూలకంటి దుర్గాంబ

రెంటచింతల, ఏప్రిల్ 19: మాచర్ల నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికం.. కానీ ఇక్కడ మహిళకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఇప్పటి దాకా 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1999లో టీడీపీ అధినేత చంద్రబాబు మహిళకు అవకాశం ఇచ్చారు. దీంతో మాచర్ల నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచిన జూలకంటి దుర్గాంబ అసెంబ్లీలోకి అడుగుపెట్టింది. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చేప్పే రాజకీయ నేతలు మహిళలకు అవకాశం ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. అసెంబ్లీలోకి అడుగుపెట్టేలా అతివలకు టిక్కెట్ల కేటాయింపులో చిన్న చూపు చూస్తున్నారన్న విమర్శ ఓటర్ల నుంచి వస్తోంది. మాచర్ల నియోజకవర్గానికి ఇప్పటి దాకా అంటే 1955 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 1999లో అప్పటి సీఎం చంద్రబాబు జూలకంటి దుర్గాంబకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించి ఆమెను చట్టసభల్లోకి అడుగుపెట్టేలా చేశారు. 1999 సెప్టెంబరులో నరసరావుపేటలో బాంబుపేలుళ్లు సంభవించడంతో అప్పటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏడు అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికలను వాయిదా వేశారు. అక్టోబరు 5న ఎన్నికలు నిర్వహించగా తుమ్మకోటలో పోలీసు కాల్పులు, అడిగొప్పలలో డీకే అరుణ భర్త భరత్‌సింహారెడ్డిపై దాడులు జరిగాయి. ఆ ఎన్నికల్లో 1951 ఓట్ల మెజార్టీతో దుర్గాంబ పిన్నెల్లి లక్ష్మారెడ్డిపై గెలిచారు. ఈమే ప్రస్తుత మాచర్ల నుంచే పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డికి తల్లి కావడం విశేషం. మాచర్ల నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల 2,60,556 మంది. వీరిలో మహిళల సంఖ్య 1,32,783, పురుషుల సంఖ్య 1,27,751. అంటే 5032 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

విన్నింగ్.. టెన్షన్

- హమ్మయ్య అంటూ.. అతి స్వల్ప ఓట్లతో గెలిచారు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్ని ఓట్ల మెజార్టీతో గెలిచామన్నది కాదు.. ఎన్నికల్లో గెలిచామా లేదా అన్నదే ముఖ్యం. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల జాతకాలు అతి స్వల్ప ఓట్లతో తారుమారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లతో పలువురు నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో కేవలం 12 ఓట్ల తేడాతో టీడీపీ ఎమ్మెల్యే సీటును కోల్పోయింది. టీడీపీ అభ్యర్థి గంజి చిరంజీవిపై ఆళ్ల రామకృష్ణారెడ్డి 12 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి వెన్నా లింగారెడ్డి 80 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1994 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మాలెంపాటి వెంకట నరసింహారావుపై కాంగ్రెస్ అభ్యర్థి సోమేపల్లి సాంబయ్య 131 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇదే నియోజకవర్గంలో 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పత్తిపాటి పుల్లారావుపై స్వతంత్ర అభ్యర్థి మర్రి రాజశేఖర్ 212 ఓట్ల అధిక్యతతో గెలుపొందారు.

1999లో గురజాల నియోజకవర్గంకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుపై కాంగ్రెస్ అభ్యర్థి జంగా కృష్ణమూర్తి 131 మెజార్టీతో గెలుపొందారు. 1978 ఎన్నికల్లో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గలో జేపీ పార్టీ అభ్యర్థి ముప్పలనేని శేషగిరిరావుపై కాంగ్రెస్(ఐ) అభ్యర్థి కోన ప్రభాకర్‌రావు 189 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 1962 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి దామినేని యజ్ఞ రంగారావుపై కాంగ్రెస్ అభ్యర్థి చేబ్రోలు హనుమయ్య 358 ఓట్లతో గెలుపొందారు. 1972లో పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మను అనంతరావు యలవర్తిపై దొప్పలపూడి రంగారావు 432 ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. 1978 ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గం నుంచి జేపీ పార్టీ తరఫున పోటీ చేసిన కొడాలి వీరయ్యపై కాంగ్రెస్(ఐ) అభ్యర్థి యడ్లపాటి వెంకట్రావు 506 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇలా అతి తక్కువ ఓట్ల తేడాతో ఎన్నికల్లో ఓటమి చెందారు.

టికెట్.. వెతుక్కుంటూ వచ్చింది..

- గాంధీభవన్‌లో బయోడేటా ఇచ్చారంతే..
- నాడు చదలవాడ జయరాంబాబుని వరించిన అదృష్టం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో ఉన్న గాంధీభవన్‌లో బయోడేటా ఇచ్చి వస్తే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఖరారైంది. ఆయనే చదలవాడ జయ రాంబాబు. ఇటీవలే స్వర్గస్తులయ్యారు. బయో డేటా ఆధారంగా సమాచారం తెప్పించుకొని టిక్కెట్ ఖరారు చేసే నాటి రాజకీయ పరిస్థితులు ఏ విధంగా ఉండేవో కళ్లకు కడుతున్నాయి. నేడు బయోడేటాకు బదులు పార్టీకి ఎన్నో రూ.కోట్లు సమర్పించుకొంటేనే సీటు గురించి ఆలోచన చేయాలి. 1985లో ఎన్టీఆర్ హవా బాగా సాగుతున్న రోజులవి. అంతకు ఏడాది ముందు 1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం కాంగ్రెస్ గాలి వీచింది. ఏపీలో మాత్రం ఎన్టీఆర్ హవా సాగింది. 1985 అసెంబ్లీ ఎన్నికలకు ఏపీలో కాంగ్రెస్ సీటు అడిగేవారు కరువయ్యారు. అప్పట్లో గుంటూరు-2 టికెట్ కోసం తన బయోడేటాను మాజీ ఎమ్మెల్యే దివంగత చదలవాడ జయరాంబాబు గాంధీభవన్‌లో ఇచ్చి గుంటూరుకు వచ్చేశారు. బయోడేటా ఆధారంగా ఏఐసిసి సర్వే చేసింది. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టిన జయరాంబాబుకు కాంగ్రెస్‌లో క్లీన్ ఇమేజ్ ఉన్నది. వాటి ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం అయనకు టికెట్ ఖరారు చేసింది. సౌమ్యుడు, నిజాయితీపరుడిగా పేరున్న జయరాంబాబు 1985, 1989 అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు-2 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో టీడీపీ అభ్యర్థి చల్లా వెంకట కృష్ణారెడ్డి చేతిలో ఓడిపోయారు.



1985లో రూ.2.5 లక్షలు మాత్రమే ఎన్నికల ఖర్చు..

పార్టీ మొదటి సారి టికెట్ ఇచ్చిన తరువాత 1985లో రూ. 2.5 లక్షలు ఖర్చైనట్లు జయరాంబాబు జీవించి ఉన్నప్పుడు తరచుగా చెబుతుండేవారు. ఏఐసీసీ రూ.10వేలు పార్టీ ఫండ్‌గా ఇచ్చింది. మిత్రులు, బంధువులు, చందాల రూపంలో మరో రూ.2 లక్షలు సమకూర్చారు. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ గాలిని తట్టుకుని అసెంబ్లీకి ఎన్నికయ్యారు జయరాంబాబు. ప్రస్తుతం ఏ పార్టీ నుంచైనా అసెంబ్లీ, లోక్‌సభకు టికెట్ కావాలంటే ఎన్నెన్నో పైరవీలు చేయాలి. అసెంబ్లీ సీటు కోసం, సీటు వచ్చిన తర్వాత గెలుపు కోసం రూ.కోట్లలో ఖర్చు చేయాల్సిందే. రాజకీయాల్లో నైతిక విలువలు లేవని, గెలుపే ప్రధానంగా అక్రమ పద్ధతులకు పాల్పడుతున్నారని ఆయన తన జీవితం చివరి రోజుల్లో ఆవేదన వ్యక్తం చేస్తుండేవారు. గుంటూరు -2 నుంచి 1985, 89, 94ల్లో వరుసగా మూడుసార్లు పోటీ చేసి 2 సార్లు గెలిచి ఒక సారి ఓడిన జయరాంబాబుకు మూడుసార్లు ఎన్నికలకు అయిన ఖర్చు రూ.20 లక్షల లోపు మాత్రమే. ప్రస్తుతం ఈ మొత్తాన్ని ఒక వార్డు మెంబర్ ఖర్చు పెడుతున్నారు.

గొట్టిపాటి నామినేషన్ అదుర్స్

- అద్దంకికి తరలిన తమ్ముళ్లు
- కార్లు, ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ
- జై రవికుమార్ అంటూ నినదించిన యువత
- ఆలయాల్లో దంపతుల పూజలు



మార్టూరులో పూజలు చేస్తున్న గొట్టిపాటి



సంతమాగులూరు, పంగులూరు నుంచి తరలివెళ్తున్న కూటమి శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 19 : అద్దంకిలో జరిగిన టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ అదుర్స్ అనిపించింది. అన్ని మండలాల్లోని గ్రామాల నుంచి పెద్దఎత్తున శ్రేణులు తరలివెళ్లారు. ముందుగా మార్టూరులో తూర్పుబజారున శుక్రవారం ఉదయం వినాయకుని ఆలయంలో గొట్టిపాటి రవికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అద్దంకిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషను వేసేందుకు వెళ్తూ మొదట యద్దనపూడి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, అనంతరం మార్టూరులోని వినాయకునికి గొట్టిపాటి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఇక్కడి నుంచి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు అద్దంకి వెళ్లారు. ఈ సందర్భంగా గొట్టిపాటికి మార్టూరు, యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుకున్నారు.

పంగులూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండలం నుంచి వేల సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని 21 గ్రామాల నుంచి 80 ప్రత్యేక బస్సులు, 150కి పైగా కారు లు, 3500 ద్విచక్రవాహనాలపై నేతలు, కార్యకర్తలు అద్దంకికి తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి యు వత బైకులపై జై గొట్టిపాటి అంటూ నినాదాలతో ర్యాలీగా కదిలారు. అలవలపాడు నుంచి ముస్లిం యువత బైకులపై గొట్టిపాటి నాయకత్వం వర్థిల్లాలంటూ చేసిన ర్యాలీ ప్ర త్యేకత సంతరించుకుంది. కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు పసుపు చీరలు ధరించి నా మినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలడంతో గ్రామాలలో కోలాహలం నెలకుంది.

సంతమాగులూరు : గొట్టిపాటి నామినేషన్‌కు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు 900 వాహనాల్లో అద్దంకి తరళివెళ్లారు.

బల్లికురవ : గొట్టిపాటి నామినేషన్ కార్యక్రమానికి బల్లికురవ మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా అద్దంకికి తరలివెళ్లారు. బైకులపై పెద్ద ఎత్తున యువత జై గొట్టిపాటి అంటూ ర్యాలీగా బయలుదేరారు.

ఏలూరి గెలుపు పర్చూరు చరిత్రలో నిలిచిపోవాలి

- ఉత్సాహంగా మహిళల ప్రచారం
- టీడీపీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి



మార్టూరులో ప్రచారం చేస్తున్న మహిళలు

మార్టూరు, ఏప్రిల్ 19 : పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం పర్చూరు చరిత్రలో నిలిచిపోవాలని కోరుతూ శుక్రవారం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం పడమర బజారున పార్టీ కార్యకర్తలు ప్రచారం చేశారు. ముఖ్యంగా మార్టూరు గ్రామంలోని టీడీపీ మహిళలు కండువాలను మెడలో వేసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని, పర్చూరులో ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. తూర్పుబజారు, విద్యానగర్, చౌదరి కాలనీ, మద్ది సీతాదేవినగర్ తదితర కాలనీల మహిళలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ మైనారిటీ, బీసీ, ఎస్సీ కుటుంబాలు, జనసేన పార్టీ కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నాయి. వలపర్ల గ్రామంలో మైనారిటీలు ముస్లిం కాలనీల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు కరిముల్లా, గ్రామ అధ్యక్షుడు ఎస్‌ఏ సలాం, గ్రామనాయకులు షేక్ బషీర్, ఎంపీటీసీ సభ్యుడు జంజనం వెంకట సుబ్బారావు, కంభంపాటి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, షేక్ అ క్రమ్, వీరు, ఖాదర్ మస్తాన్, బడేసా, మన్సూర్ పాల్గొన్నారు.

అరాచక వైసీపీని గద్దె దింపండి

చినగంజాం, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసి, అరాచక పాలన సాగించిన వైసీపీని గద్దె దింపాలని టీడీపీ కూటమి నా యకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని చినగంజాం గ్రామం, పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధి లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివ రావు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ శుక్రవారం రాత్రి ప్రచారాన్ని నిర్వహించారు. చినగంజాం గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని మాయాబజారు, వైశ్యబజారు, రాజాహాల్, అన్నపూర్ణ హాల్ సెంటర్లలో, పల్లెపాల్లెం ఎంపీటీసీ సభ్యులు వీతా భార్గవి, మండల బీసీ సెల్ అధ్యక్షులు వాటుపల్లి ఏటుకొండలుల ఆధ్వర్యంలో బాపయ్యనగర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లును అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, కొండ్రగుంట శ్రీహరి, రాయని ఆత్మారావు, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, అజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, పీ.పార్థసారిథి, షేక్ జిలాని, ఎస్.సుబ్రమణ్యం, భయ్యా సతీష్, ఉలిచి ఏసుబాబు, శిఖరం కోటయ్య, ఎ.శ్రీనివాసరావు, ఎన్‌సీ.సుబ్బారావు, టి.సతీష్, ఎన్.గోపి, గంటా చెన్నయ్య, కోట శివరామకృష్ణ, సీ.హెచ్.రవణమ్మ, ఎం.పద్మావతి, ఎం.రామాంజనేయులు, లక్ష్మయ్య, టి.చిన్నా, వీ.శ్రీనివాసరావు, జి.నరసింహారావు, షేక్ హుస్సేన్‌బాషా, టి.దుర్గారావు, సంఖ్యా శ్రీను పాల్గొన్నారు.

గంగవరంలో ఇంటింటి ప్రచారం

ఇంకొల్లు, ఏప్రిల్ 19 : మండలంలోని గంగవరం గ్రామంలో రాష్ట్రంలో చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని, పర్చూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. మహిళలు ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు, బొడెంపూడి సుబ్బారావు, కొల్లి సుబ్బారావు, కేసరి వీరారెడ్డి, కరి నాగేంద్రమ్మ, అప్పారావు, విజయకుమారి, కరివాసు, పార్వతి, రామాంజమ్మ, అచ్చాయమ్మ, అంజలి పాల్గొన్నారు.





చినగంజాంలో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి నాయకులు .. ప్రచారంలో పాల్గొన్న గంగవరం శ్రేణులు

అద్దంకి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయను

- వచ్చేది కూటమి ప్రభుత్వం
- దుష్ట పాలన అంతమై..ధర్మ పాలన వస్తుంది
- మీడియాతో గొట్టిపాటి



మీడియాతో మాట్లాడుతున్న గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : అద్దంకి నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, ఇచ్చిన ప్రతిమాటా నిలబెట్టుకుంటానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగు సార్లు పోటీ చేయగా, ఎమ్మెల్యేగా అద్దంకి ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఐదోసారి నామినేషన్ వేశానని, ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అసెంబ్లీకి వెళ్తానన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీల నాయకత్వంలో కచ్చితంగా రాబోయే రోజులలో ఆంధ్రరాష్ట్రంలో 175కు 160 సీట్లు గెలవబోతున్నామని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కూటమికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని, జగన్ దుష్ట పాలనను అంతమై.. ధర్మపాలన వస్తుందన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కూటమి శ్రేణులు, అద్దంకి ప్రజలకు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

కొండయ్య తరపున నామినేషన్ దాఖలు

- ఆర్వోకు అందజేసిన కుమారుడు గౌరీ అమర్‌నాథ్
- ముగ్గురి నామినేషన్ల స్వీకరణ



నామినేషన్ దాఖలు చేస్తున్న గౌరీఅమర్‌నాథ్

చీరాల, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య తరపున ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్ (ప్రపోజర్) తదితరులు శుక్రవారం ఆర్వో సూర్య నారాయణరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున అంకమ్మగాంధీ లగడపాటి, స్వంతంత్ర అభ్యర్థి పింజల శాంతారాం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థుల తరపున నాలుగు సెట్ల నామినేషన్లను ఆర్వో స్వీకరించారు.

పర్చూరులో నలుగురు

పర్చూరు : పర్చూరులో రెండో రోజు శుక్రవారం మొత్తం నలగులు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా యడం బాలాజీ నామినేషన్ వేశారు. పిరమిడ్ పార్టీ తరుపున బెండపూడి లోకేశ్వరశర్మ, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ ఖాశిం సైదా, జాతీయ సమసమాజ పార్టీ అభ్యర్థిగా బాచిన రాంబాబు నామపత్రాలను దాఖలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ తెలిపారు.

22న బొగ్గులకొండ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



బల్లికురవ, ఏప్రిల్ 19 : మండలంలోని కూకట్లపల్లి గ్రామ పరిధిలో ఉన్న బొ గ్గులకొండ యెగ ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ల ఈనెల 22వ తేదీన జరుగుతుందని ఆలయ ధర్మకర్త తాళ్ల శివశంకర్‌రెడ్డి తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ప్ర త్యేక భజనలు, కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని అలానే అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

షర్మిల నుంచి బీఫాం అందుకున్న శ్రీలక్ష్మీజ్యోతి



బీఫాం అందజేస్తున్న షర్మిల

పర్చూరు, ఏప్రిల్ 19 : పర్చూరు శాసన సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్ఆర్ఐ నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి శుక్రవారం కర్నూలు జిల్లాలోని ఆదోనిలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల నుంచి బీఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చి అవకాశం కల్పించిన షర్మిల, మాజీ మంత్రి జేడీ శీలం, జిల్లా డీసీసీ అధ్యక్షుడు గంటా అంజిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టంరాజుకు ఉగాది పురస్కారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19: ఒంగోలులో జేపీసీ ఉగాది పురస్కార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీన పది మందికి ఉగాది పురస్కారాలను అందిస్తున్నారు. దీనిలో భాగంగా సమాజ సేవలో, విద్యారంగంలో, సాహిత్య సామాజిక రంగాలలో సేవలందిస్తున్న అద్దంకికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి ఉగాది పురస్కారాన్ని ఇవ్వనున్నారు. ఉగాది పురస్కారానికి ఎంపికైన పుట్టంరాజును సంఘాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.

సైకిలెక్కుతున్న యువత

కూటమి అభ్యర్థి కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు



కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వాడరేవు యువకులు

చీరాల, ఏప్రిల్ 19 : మాకు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. మా ఓటును సైకిల్ గుర్తుపైనే వేస్తామని నవ యువ ఓటర్లు ప్రకటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యం. ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం బాబుతోనే సాధ్యమని చీరాల మండలం వాడరేవుకు చెందిన తొలిసారిగా ఓటు హక్కును పొందిన పలువురు యువకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని కొండయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన మీలో ఉన్న కసి, ఉత్సాహం చూస్తుంటే ప్రజా చైతన్యానికి నిదర్శనంగా కన్పిస్తోందన్నారు. ఆ స్ఫూర్తిని గ్రామంలో మిగిలిన వారిలోనూ రగిలించాలని వారిని కూడా కార్యోన్ముఖులను చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏబీసీ కార్మికులతో మాట్లాడుతున్న కొండయ్య

ఆదరించండి.. నమ్మకాన్ని వమ్ముచేయను

చీరాల, ఏప్రిల్ 19 : ఆదరించి.. ఓటు వేసి.. గెలిపించండి.. మీ నమ్మకాన్ని వమ్ముచేయనని కూటమి అభ్యర్థి కొండయ్య అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. రామకృష్ణాపురం పరిధిలోని ఏబీసీ సంస్థ మహిళాకార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం ఉడ్‌నగర్, కొట్లబజారు తదితర ప్రాంతాల్లో కొండయ్య ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యం

- గొట్టిపాటి నామినేషన్‌లో లేని ముందస్తు చర్యలు
- నామ్‌రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టని వైనం
- శింగరకొండ వద్దే వేలాదిగా వెనుదిరిగిన తమ్ముళ్లు



గొట్టిపాటి నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన శ్రేణులు

అద్దంకి, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవి కుమార్ నామినేషన్‌కు భారీ సంఖ్యలో కేడర్ తరలివస్తారని ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ పోలీసులు తగిన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలోని అత్యధిక గ్రామాల నుంచి నామ్ రోడ్డు ద్వారా అద్దంకిలోజరిగే నామినేషన్ ర్యాలీకి కూటమి శ్రేణులు వాహనాలల్లో తరలివచ్చారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను ముందస్తుగానే అడ్డరోడ్డు నుంచి మళ్లించడమో లే క నిలిపి వేయాల్సి ఉండగా అలా చేయలేదు. గోపాలపురం, శింగరకొండ వరకు అనుమంతించడంతో భారీ వాహనాలు సైతం బారులు తీరాయి. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కూడా గోపాలపురం, శింగరకొండ వద్దనే ఆగిపోవలసి వచ్చింది. దీంతో వేలాది మంది కార్యకర్తలు అద్దంకిలో జరిగిన ర్యాలీకి హాజరు కాకుండానే నిరుత్సాహంతో వెనుదిరిగారు. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తామని పదేపదే చెప్తున్నప్పటికీ ఆ దిశగా ఏర్పాట్లు చేయడం లేదని, పోలీసుల నిర్లక్ష్య చర్యలతో ఈ పరిస్థితి ఏర్పడిందని నేతలు ఆరోపిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

చీరాల, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ కామాక్షికేర్ హాస్పటల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వేళ అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే అక్కడ ఉన్నవారు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని రామకృష్ణ చెప్పారు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగసినపుడు కంగారు పడకుండా ఆ మంటలను నియంత్రించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా చూపించారు. ఇతర అగ్ని ప్రమాదాలపై కూడా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి జీ ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద వైద్యులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే ఫైర్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్ కుమార్, డాక్టర్ పీ వెంకటకిరణ్, డాక్టర్ జీ మెర్సీ, డాక్టర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

26న ఉరుసు వేడుకలు

మార్టూరు, ఏప్రిల్ 19 : హజరత్ కరిముల్లాషావలి ఉరుసు వేడుకలు ఈనెల 26 వతేదీ శుక్రవారం మార్టూరులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొణిదెన రోడ్‌లో ఉన్న దర్గా వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారని, శుక్రవారం అర్ధరాత్రి పీర్ల చావిడి నుంచి గంధం బయలుదేరుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మార్టూరు ప్రాంత భక్తులు ఉరుసు వేడుకలను చూసేందుకు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ కోత

మార్టూరు, ఏప్రిల్ 19: మండలంలోని కోనంకి, నాగరాజుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏ ఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

31 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 19 : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 31 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ శుక్రవారం తెలిపారు. మార్టూరు గ్రామం నుంచి 20 మంది, తాటి వారిపాలెంలో 7గురు మిగిలిన గ్రామాల నుంచి పలువురు రాజీనామా చేసినట్లు తెలిపారు.

మంచి చేతి రాత నేర్చుకోవాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 19 : విద్యార్థులు చిన్నతనం నుంచి మంచి చేతి రాతను నేర్చుకోవాలని గంగవరం బాలల సైన్స్ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేదిక కన్వీనర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏవీ సుబ్బారావు సూచించారు. మండలంలోని గంగవరం ఎస్‌వీకే హైస్కూల్‌లో శుక్రవారం చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.సమత, వై.సిద్దయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్, మైక్ సెట్ బహూకరణ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం పలువురు దాతలు టేబుల్, మైక్ సెట్‌ను బహూకరించారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని పీ జ్యోతినిర్మలకు టేబుల్, మైక్‌సెట్‌నుఅందజేశారు. అలాగే కాసమ్మ పాఠశాలకు ఆఫీస్ కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా వడ్లవల్లి వీరనారాయణ, దాతలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సన్మానించారు.

నేడు గొట్టిపాటి ప్రచార వివరాలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవి కుమార్ శనివారం సాయంత్రం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కావున మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

దరి చేరని సాగర్ జలాలు

- అడుగంటిన చెరువులు
- ఆందోళనలో పలు గ్రామాల ప్రజలు



సాగర్ జలాల కోసం సిద్ధం చేసిన కాలువ నీరు లేక ఇలా

పర్చూరు, ఏప్రిల్ 19 : ఎన్నో ప్రయాశలతో చెరువులను శుభ్రం చేసుకొని ఎక్స్‌కవేటర్‌తో కాలువలను తవ్వించి బ్లీచింగ్ చల్లి ఆరబెట్టుకొని చెరువులను సిద్ధం చేశారు. సాగర్ జలాలు వచ్చి చెరువులు నిండి మంచినీటి అవసరాలు తీరుతాయని ఎదురు చూసిన ఆశలు అడియాసలయ్యాయి. సాగర్ జలాలను విడుదల చేసి పది రోజులు గడుస్తున్నా నేటికీ చెరువులకు చుక్క నీరు కూడా చేరలేదు. దీంతో నీరులేక వెలవెలబోతున్న చెరువులు దర్శనమిస్తున్నాయి. మరోవక్క వేసవి ముంచుకొస్తోందని, నేటికీ చెరువులు అడుగంటడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాగర్, కొమ్మమూరు కాలువ పరిధిలో 18 మంచి నీటి చెరువులు ఉండగా దాదాపు నీరులేక అడుగంటాయి. మండలంలోని నాగులపాలెం గ్రామంలో ఉన్న రెండు మంచినీటి కంపార్ట్‌మెంట్‌లతో ఇప్పటికే ఒక చెరువు నీరులేక ఎండిపోగా, రెండో చెరువులో ఉన్న అరకొర నీరు రంగుమారి దుర్వాసన వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రమైన పర్చూరులో ఉన్న రెండు మంచి నీటి చెరువులు అడుగంటాయి. దాదాపు మండలంలోని అన్ని చెరువుల పరిస్థితి ఇలానే ఉంది. వేసవిని అధికమించేందుకు మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. మరోవక్క నూతలపాడు మైనర్‌కు చుక్కనీరు కూడా చేరకపోవడంతో ప్రజల్లో నైరాశ్యం నెలకొంది. అసలు సాగర్ జలా లు చెరువుకు చేరతాయా లేదా అన్న సందేహం నెలకొం ది. ఇప్పటికే ప్రజలతో పాటు, పశువులు నీటి కోసం అ ల్లాడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులను సాగర్ జలాలతో నింపి ప్రజల దా హార్తిని తీర్చాలని కోరుతున్నారు. ఆదిశగా ప్రభుత్వ యంత్రాంగం దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నీరు లేక వెలవెలబోతున్న నూతలపాడు మైనర్ కాలువ

చెరువులకు చేరకుండానే నిలిచిన జలాలు

- నీటి కష్టాలు తప్పవంటున్న ప్రజలు
- అధికారుల తీరుపై ఆగ్రహం

పంగులూరు, ఏప్రిల్ 19 : ప్రజల తాగునీటి అవసరాల కోసం చెరువులు నింపేందుకు విడుదలైన సాగర్ జలాలను నిలిపివేశారు. మండలంలోని చెరువులకు నీరు చేరకుండానే సాగర్ జలాలు నిలిపి వేయడంతో వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. గత డిసెంబర్‌లో విడుదలైన సాగర్ జలాలు చెరువులకు చేరకపోగా ఏప్రిల్‌లో కూడా సాగర్ జలాలు కూడా చెరువులకు చేరకుండానే నిలిపి వేయడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో 10 నోటిఫైడ్, 10 నాన్ నోటిఫైడ్ చెరువులను సాగర్ నీటితో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేసిన ప్రయత్నం ఫలితం ఇవ్వలేదు. ఒక్క రామకూరు చెరువును 50 శాతం సాగర్ జలాలతో నింపారు. తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే జనకవరం, నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెంతో పాటు చందలూరు పరిసర గ్రామాలకు సాగర్ జలాలు చెరువులకు చేరకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వేసవిలో నీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ప్రజల నీటి అవసరాలు గుర్తించకుండా మొక్కుబడిగా నీటిని సరఫరా చేసి మమ అనిపించిన అధికారుల చర్యలను ప్రజలు తప్పుబడుతున్నారు.